# పాదరక్షల ప్రహసనం



పెళ్ళిళ్ళలకూ పాదరక్షలకూ చాలా దగ్గర సంబంధం ఉందని అందరూ ఒప్పుకుంటారు. ఒప్పుకోవడమేకాదు, వళ్ళు మండిందంటే "ఎవడన్నా లేదన్నాడంటే వాడిని చీరేస్తాం" అనికూడా అంటారు. పెళ్ళివారికి కట్నాల గురించిగానీ మరే ఇతర లాంఛనాల గురించిగానీ పేచీ వచ్చిందనుకోండి. అప్పుడువారు చెప్పులు యధేచ్ఛగా ఉపయోగించుకుంటారు. లేదా ఇద్దరూ కలసి మధ్యవర్తి మీద ప్రయోగిస్తారు. కొంతమందికి పెళ్ళిళ్ళల్లో వియ్యంకుల తరపున వారి చెప్పులు దొంగలించటం సంప్రదాయం కూడా.

అయితే నేను రాయదల్చుకుంది ఈ విధమైన సంబంధం గురించి కాదు. మనందరం అనుభవించే మరో సంబంధం గురించి.

అదేమిటంటే పాదరక్షలు పోగొట్టుకోవటం.

అంటే నా ఉద్దేశ్యం పెళ్ళిళ్ళలో ఇంకేమీ పోవని కాదు. ఆ మాటకొస్తే పెళ్ళిళ్ళల్లో పోని వస్తువంటూ ఉండదు. గరిటెలు, స్పూనులూ, బట్టలూ, పాత్రలూ, నగలూ, చిన్నపిల్లలూ, మిఠాయిలూ– ఇలా ఆయా పెళ్ళిళ్ళకొచ్చిన అతిథులు అభిరుచులను బట్టి అన్నీపోతూ ఉంటాయి. కానీ వీటన్నింటి కంటే కూడా సిస్టమేటిగ్గా, అదో నిబంధనగా చాలామంది

చెప్పులు పోగొట్టుకోవటం వల్ల పెళ్ళిళ్ళలో పాదరక్షలకున్న ప్రాముఖ్యత మరి దేనికీ ఉండదు. ఇక ముందు ఉండబోదు.

నేను రెండేళ్ళపాటు జీతంలో ప్రతినెలా కొంత డబ్బువాయిదా పద్ధతిలో ఒక చెప్పుల షాపువాడికి కట్టి, ఇష్టమైన చెప్పుల జత ఆ మధ్యే కొన్నాను. అంటే ఆ బాకీ తీరిపోయిందని కాదు. మరో ఎనిమిది నెలలపాటు వాడికీ వాయిదాలు చెల్లిస్తూనే ఉండాలి. అప్పుడు పూర్తిగా అవి నా సొంతం అవుతాయన్నమాట! అంతవరకూ అవి ఆ షాపు యాజమాన్యం పేరే ఉంటాయి. మధ్యలో నేను చనిపోవడం వల్లగానీ, లేదా మరే కారణం వల్ల గానీ మిగతా వాయిదాలు కట్టడం మానేస్తే వాటి యాజమానులు వాటిని స్వాధీనం చేసుకుంటారు.

అంచేత ఆ ఎనిమిది నెలలూ అయ్యాకే వాటిని వాడటం ప్రారంభించాలని నిర్ణయం తీసుకుని వాటిని ఆ షాపు యాజమాన్యం వారిచ్చిన అట్టపెట్టెతో సహా స్టీల్ అల్మరాలో దాచేశాను. నా అద్భుతమైన ప్లాన్ తప్పక విజయవంతం అయేదేమోగానీ– ఇంతలో మా రామరాజుగాడి పెళ్ళి వచ్చింది. సరిగ్గా ఆ సమయానికే నా పాత చెప్పులు ఇక రిపేర్‌కి పనికిరావని ఖండితంగా చెప్పేశాడు, అవి గత మూడేళ్ళనుంచీ రిపేరు చేస్తున్న చెప్పుల మెకానిక్.

గత్యంతరం లేక కొత్త చెప్పులు వేసుకునే వాడి పెళ్ళికి చేరుకున్నాను. పొరపాటునయినా వాటికి ఎదురు దెబ్బలూ, గాయాలూ తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నాను. ఎందుకంటే వాటిమీద సర్వాధికారాలూ ఇంకా ఆ షాపు యాజమానికే ఉన్నాయి కదా.

పెళ్ళి తంతుముగిసింది "ఆ! భోజనాలకు రండి" అని అరిచారెవరో.

మరుక్షణం పందిట్లో జనమంతా హాల్లోకి జొరబడిపోయారు. నేనూ నా చెప్పుల్ని జాగ్రత్తగా వో పక్కన విడిచి భోజనానికని లోపలికెళ్ళాను. అప్పటికే హాలంతా నిండిపోవడంతో రెండో పంక్తిలో కూచోవచ్చని మళ్ళీ బయటికొచ్చి చూసేసరికి చెప్పులు వాటిస్థానంలో కనిపించలేదు నా గుండెలు జల్లుమన్నాయి.

త్వరత్వరగా ఆవరణ అంతా వెదికాను. ఎక్కడాలేవు.

"ఏం, గురూజీ! ఏమిటి చూస్తున్నావ్?" అడిగాడు భవానీశంకరం, వాడూ, నేనూఒకప్పుడు క్లాస్‌మేట్స్‌మి.

"చెప్పులు కనిపించటం లేదు" అన్నాడు కంగారు అణచుకుంటూ.

"ఎవడోకొట్టేసి ఉంటాడు– దానికి పెద్ద ఇదేముంది" అన్నాడతను.

"అదేమిటి? నేను వాటిని విడిచి ఒక్క నిమిషమేగా అయింది?"

"ఒక్క నిమిషం చాలా ఎక్కువ వాడికి"

"ఎవడువాడు?"

"అది తెలుస్తే కథ లేదుగా?" నవ్వుతూ అన్నాడు.

నేను పెద్దాడయాక ఎప్పుడూ ఏడవలేదు. చిన్నప్పుడు ఏడవడమే! మరి ఇంతకాలం ప్రాక్టీస్ లేకపోయినా ఇప్పుడు ఇన్‌స్టెంట్‌గా ఏడుపొచ్చింది. వాటికి కట్టవలసిన మిగతా వాయిదాలు తీరకుండానే, వాటిమీద సర్వహక్కులూ ఆ షాపు యాజమాన్యాని కుండగానే పోగొట్టుకుంటే ఇప్పుడు వాళ్ళకేం జవాబు చెప్పాలి?

విచారంగా కుర్చీలో కూలబడ్డాను.

భవానీశంకరం నా పక్కనే కూర్చున్నాడు. కూర్చుని ఆ చెప్పుల వివారాలన్నీ ఒకటొకటీ అడిగి తెలుసుకుని మరీ సానుభూతి ఒలకబోస్తున్నాడు. వాడు సానుభూమి ఒలకబోస్తున్న కొద్దీ నాకు మరీ ఏడుపెక్కువై పోతోంది.

"గురూ! నేనో ప్లాన్ చెప్తాను. చేస్తావా?" అన్నాడు వాడు రహస్యంగా.

"ఏమిటి?" అనుమానంగా అడిగాను.

"చేస్తానంటే? చెప్తాను"

"ఏది? అప్పుడు కాలేజ్ డేస్‌లో యిచ్చిన ప్లాన్‌లాంటిదేనా?" అడిగాను అనుమానంగా.

ఈ కథ ఏమిటంటే అప్పుడు కాలేజీలో మమ్మల్నిద్దరినీ ఏదో విషయంలో ప్రిన్సిపాల్ వారం రోజులపాటు డిబార్ చేశాడు. ప్రిన్సిపాల్ మీద ఎప్పటికైనా నేను ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞచేస్తే, భవానీశంకరం "ఎప్పటిదాకానో ఎందుకురా? ఇవాళే తీర్చుకోవచ్చు. దానికి నేనో ప్లాన్ చెప్తాను" అన్నాడు. ఆ ప్లానేమిటంటే ప్రిన్సిపాల్‌కి వ్యతిరేకంగా కాలేజీలో గోడలనిండా బొగ్గుతో అశ్లీలపదాలు రాయడం! ఆ ప్లాన్ మహత్తరమైందని వాడు నన్ను నమ్మించడం చేత నేను ఆ రాత్రి గోడలమీద బొగ్గుతో రాస్తూ పోలీసులకు దొరికిపోయాను. వాళ్ళ బారినుంచి తప్పించుకుని బయటపడడానికి నెలరోజులు పట్టింది.

భవానీశంకర్ మనస్ఫూర్తిగా నవ్వాడు.

"ఛ ఛ! అది వేరు ఇది వేరు! ఇది పర్‌ఫెక్ట్ ప్లాన్" అన్నాడు.

"ఏం చేయమంటావ్?"

"ఏదో మరో మంచి జత చెప్పులు చూసి వేసుకుని వెళ్ళిపో"

నేను ఉలిక్కిపడ్డాను. "ఇంకొకరివా?"

"అవును"

"ఛీ! తప్పు కదూ?"

"మరి నీ చెప్పులు వేసుకెళ్ళినవాడు అది తప్పు అని అనుకోలేదు గదా?"

"ఓహో! అట్నుంచి వచ్చావా!" ఆలోచిస్తూ అన్నాను.

నా వీక్‌నెస్ కనిపెట్టివాడు మళ్ళీ నా చెవిదగ్గర గొణిగాడు.

“నీకేం సంకోచం అక్కర్లేదురా! ఇదిగో! నా చెప్పులు చూడు! ఇవి నా స్వంతం అనుకుంటున్నావా? అబ్బే! ఇలా కొట్టేసినయ్యే!”

నేను వాడి చెప్పుల వంక చూశాను. చాలా కొత్తగా అద్భుతంగా ఉన్నాయి.

“మరి ఎవ్వరూ కనిపెట్టలేదూ?” అనుమానంగా అడిగాను “వాటి ఓనరు నా ముందు నుంచి పద్నాలుగు సార్లు తిరిగాడు గానీ, గుర్తుపట్టలేదు. ఒకవేళ గుర్తుపట్టినా అడిగే ధైర్యం ఎక్కడినుంచి వస్తుంది? అయినా నీకేం ఫర్లేదు. నేను నీ పక్కనే ఉంటాను!”

నాకు కొంచెం ధైర్యం వచ్చింది.

“ఇప్పుడేం చేయమంటావు?”

“లేచి రంగంలోకి దూకు! వరండాలో కెళ్ళు. అక్కడున్న వాటిల్లో బెస్ట్ జత సెలెక్ట్ చేసుకో! అటూ ఇటూ చూడకుండా- సిగరెట్ వెలిగించుకుంటూ వాటిని కాజువల్‌గా తొడుక్కో- అంతే, ఆ తరువాత తిన్నగా ఇంటికెళ్ళిపో- వెనక్కు తిరిగి చూడవద్దు. వెనుక నుంచి కేకలు, అరుపులు, పోలీస్ విజిల్స్- ఇలాంటివేమి వినిపించినా వెనక్కు తిరక్కు! జయంనీదే!”

“అంతేనంటావా!” వణుకుతోన్న గొంతుతో అన్నాను.

“అంతే!”

నేను కుర్చీలో నుంచి నిలబడ్డాను. వరండాలో చిందరవందరగా కనబడుతున్నాయి- చెప్పులు! త్వరగా నడిచి మాంచి కొత్త జత దగ్గర ఆడి సిగరెట్ వెలిగించుకున్నాను. మరుక్షణంలో ఆ చెప్పులు రెండూ నా కాళ్ళకు అమరిపోయాయి. వెనక్కు తిరిగి రెండడుగులు వేసేసరికి ఎవరో భుజం తట్టారు. నా ప్రాణాలు పైకి రాకెట్ లా దూసుకుపోయాయి. వణుకుడుని సర్దుకుంటూ వెనక్కుతిరిగి చూశాను. లావుపాటి పొట్టగల ఆకారం నన్ను చూసి నవ్వింది.

“ఏ.... ఏ.... ఏ... మి... టి...?” అన్నాను ఏడుపు ఆపుకుంటూ.

“చెప్పులు....” అన్నాడు. నేను పట్టుబడిపోయాను. అతనిని కౌగిలించుకుని బావురుమని ఏడ్చేయాలన్న ఫీలింగ్‌నీ బలవంతంగా ఆపుకున్నాను.

“నిజం సార్! ఇవి నావే- భలేవారే! నేనలాంటి పనిచేస్తానా? ఒట్టు! కావాలంటే మా భవానీశంకర్ నడగండి- వచ్చేప్పుడు ఇవి వేసుకున్నానో లేదా-” అన్నాను బ్రతిమాలుతున్న ధోరణిలో.

ఆ లావుపాటి ఆకారం మళ్ళీ నవ్వింది.

“అబ్బే- నేననేది అదికాదు. మీ కాళ్ళ వంక చూడండోసారి.”

నేను నా కాళ్ళవంక చూసుకున్నాను.

రెండు కాళ్ళకూ రెండురకాలు చెప్పులున్నాయి అంటే ఆ ఖంగారులో నేను రెండు రకాల చెప్పులు తొడిగేసుకున్నానన్నమాట! ఒక్కసారిగా ధైర్యం తిరిగి వచ్చేసింది.

"ఇదా! నేను చూసుకోలేదులెండి. ఏదో ఆలోచిస్తూ.... ఇహిహి...." అంటూ ఆ లావుపాటి ఆకారానికి థాంక్స్ చెప్పి రెండో కాలి చెప్పు తీసేసి దాని తాలూకు జత చెప్పు తొడుక్కుని వరండా దిగి పందిట్లో కొచ్చి భవానీశంకర్ పక్కగా కూర్చున్నాను.

"అలా వణకకు! బావుండదు" అన్నాడు వాడు కోపంగా.

"నే.... నే... నే... నెక్కడ... వ... వ.. ణుకుతున్నాను..." అన్నాను ఖంగారుగా. ఇంకొంచెం ఎక్కువగా వణుకుతూ

"నా మాట విని ఇక్కడి నుంచి మీ ఇంటికి త్వరగా వెళ్ళిపో! నువ్వలావణకడం చూస్తే ఎవరికైనా అనుమానం వస్తుంది."

'మ... మ... రి.... భో..... జ........ జ........... నం......."

"పోతే పోనీ– వెధవ భోజనం! భోజనం కోసం చూసుకుంటే పట్టుబడిపోతావ్!"

గత్యంతరం లేక లేచి వడివడిగా బయటకు నడవబోయాను. తీరా రెండడుగులు వేశానోలేదో, "ఏవండోయ్ మాస్టారూ" అంటూ ఎవరో నన్ను పిలవడం వినిపించింది. హఠాత్తుగా నాలో మళ్ళీ వణుకు జబ్బు ప్రవేశించింది. ఎవరో నన్ను కనిపెట్టేశారు. ఆ చెప్పులువోనర్ కేకపెట్టి ఉంటాడు.

ఏమిటిప్పుడు చేయడం?

నాకు సడన్‌గా భవానీశంకర్ మాటలు గుర్తుకొచ్చాయి.

"ఇలాంటి మహత్తరమైన కార్యక్రమం చేపట్టినప్పుడు వెనక్కి తిరిగి చూడకు బ్రదర్, అరుపులు కేకలు పోలీస్ విజిల్స్ ఇలాంటివేమి వినిపించినా– సరే వెనక్కు తిరగకు–" అంచేత నేను వెనక్కు తిరగదల్చుకోలేదు. ధైర్యంగా ముందుకు సాగిపోయాను.

కానీ ఆ వ్యక్తి అరుపులతో ఆగలేదు.

పెద్ద అంగలు వేసుకుంటూ నా కెదురు వచ్చి నిలబడ్డాడు. ఇలా చెప్పుల యజమానులు అడ్డం నిలబడే పరిస్థితి వచ్చినప్పుడు ఏం చేయాలో నాకు భవానీశంకర్ క్లూ ఇవ్వలేదు. అందుకని వాడివైపు చూశాను. వాడు ఇదేం పట్టనట్లు సినిమా పత్రిక చదువుకుంటున్నాడు.

"ఇవి నా వేనండీ!" అన్నాను గాభరాగా.

"ఏవి మీవి?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"ఇవే చెప్పులు..."

"చెప్పులేమిటి?"

"అదే కాళ్ళవేసుకునే చెప్పులు!"

"కాళ్ళకు వేసుకునే చెప్పులా?" అయోమయంగా అడిగాడతను.

"అవును"

"అయితే- వాటికేమయింది?"

"అవి నావే అంటున్నాను. కావాలంటే మా భవానీశంకర్‌ని అడగండి అంటూ ఒరే భవానీ!" అని పిలిచాను వాడిని.

"ఆ! ఏమిటి?" అంటూ పరుగుతో వచ్చాడువాడు.

"ఈ నొప్పులు చెప్పేకదరా?" ఖంగారుగా అని, వెంటనే సరిదిద్దుకుని, " ఈ చెప్పులు నావేకదుట్రా?" అనడిగాను.

"అవును మాస్టారూ! హి ఈజ్ ది వోనర్ ఆఫ్ దీజ్ చెప్పల్స్! ఆ విషయం నేను ఖండితంగా చెప్పగలను. ఎలా చెప్పగలనంటారా? వాడు అలాంటివాడు కాదుకాబట్టి! నాకు తెలిసినంతవరకూ ఎప్పుడూ ఎవరిచెప్పులూ దొంగతనం చేయలేదు. ఎన్నో మంచి అవకాశాలు వచ్చాయ్. కొత్తవి, అద్భుతమయిన మోడల్స్, విదేశీబూట్లు కూడా కనిపించాయ్, అయినా వాడెప్పుడూ వాటి వంకయినా చూడలేదు. నేనూ అంతే. ఎప్పుడూ నా చెప్పులే వేసుకుంటాను. ఎంత పాతయినా సరే! పెళ్ళిళ్ళకు వెళ్ళినా సరే- మీ చెప్పులే మీరు ఉపయోగింపుడు అన్న ప్రిన్సిపుల్‌కి లోబడి జీవితం గడుపుతున్నాం! అంచేత, దయచేసి వాడిని అనుమానించకండి! వాడి చెప్పులకు వాడే యజమాని! అలాగే నా చెప్పులకు నేనే వోనర్‌ని! ఇద్దరం కేవలం నీతిమీద నిలబడతాం గానీ, పరాయివాడి చెప్పులమీద కాదు."

ఆ పెద్దమనిషి చిరాగ్గా చూశాడు భవానీని!

"ఇప్పుడు చెప్పులు దొంగిలించారని ఎవరన్నారయ్యా! తమరు భోజనం చేయకుండా వెళ్ళడానికి వీల్లేదంటున్నాను అంతే" అన్నాడు నాతో వినయంగా.

నాకు పోయినా ప్రాణాలన్నీ కేరింతలు కొట్టుకుంటూ తిరిగి వచ్చేసినయి.

"భోజనమా? దాన్దేముంది- తరువాత చేస్తాను అలా వెళ్ళి వచ్చి....."

"అలా వద్దు సార్! దయచేసి భోజనం చేశాకే వెళ్ళండి! కొంచెం ఆలస్యం అయిన మాట నిజమే! అంతమాత్రాన అలా కోపగించుకుంటే ఎలాగండి- రండి! అలా రెండు నిమిషాలు కూర్చోండి! రెండో బంతి పావుగంటలో రడీ అవుతుంది...." అంటూ నా చేతులు పట్టుకుని తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టాడు. చేసేదిలేక వేధవ ముఖం వేసుకుని కూర్చున్నాను. శంకర్ కూడా నా పక్కనే కూర్చున్నాడు.

"మనం తొందరపడి చెప్పుల గురించి మాట్లాడకూడదు" అన్నాడువాడు.

"అవును! ఇప్పుడు కదా ఆ విషయం తెలిసింది" అన్నాను నేను.

"ఈసారి ఎవరైనా పిలిచినా ఛస్తే చెప్పుల గురించి మాట్లాడకూడదు" అన్నాడువాడు.

"ఇప్పుడు తదుపరి కార్యక్రమం ఏమిటి?" అడిగాను మళ్ళీ చెప్పుల సంగతి గుర్తు తెచ్చుకుని.

"ఏముందీ? ఈసారివాడు పిలుస్తున్నా ఆగకుండా బయటకు పరుగెత్తు..."

"అలా పరుగెడితే అందరికీ అనుమానం రాదూ?"

"వచ్చినా సరే– మన దేహ సౌందర్యరక్షణ ముఖ్యం కదా!"

"అంతేనంటావా?"

"అక్షరాలా అంతే!"

"పోనీ భోజనం చేశాకయితే బాగుంటుదేమో. అప్పుడయితే వాడిక అడ్డుపడడు."

"వాడు అడ్డుపడడు గానీ, ఇప్పుడు మొదటి పంక్తిలో కూర్చుని భోజనం చేస్తున్న ఈ చెప్పుల వోనరు బయటికొస్తే తప్పక అడ్డుపడతాడు."

"అవునవును! ఆ విషయం మర్చేపోయాను" అన్నాను మళ్ళీ వణుకులోకొచ్చేస్తూ.

"హలో" అన్నగొంతు వినిపించి ఇద్దరం అదిరిపడ్డాం.

మా వెనకాలే నిలబడ్డాడో వ్యక్తి. అలా చిరునవ్వుతో పలుకరించే వాళ్ళను చూస్తే భలే ముచ్చటవేసేది. కానీ ఈ చెప్పులు తస్కరించిన కొద్దిసేపటి నుంచీ ఆ చిరునవ్వు ఎంతో భయంకరంగా గుండెల విశిపోయేలా కనబడుతూంది.

"యస్" అన్నాడు భవానీశంకర్ ధైర్యంగా.

నేను ఆ పెద్దమనిషికి నా చెప్పులు కనిపించకుండా కాళ్ళు కుర్చీ కిందకు లాక్కున్నాను. అతను మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

నాకు చటుక్కున భవానీ శంకర్ మాటలు గుర్తుకొచ్చాయి, అతను వచ్చింది చెప్పుల గురించి కాదేమో! "మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుంది"– అన్నాను సంభాషణ వేరే రంగంలోకి దింపుతూ.

"ఉండొచ్చు–ఉండొచ్చు" అన్నాడతను ఇంకా చిరునవ్వు నవ్వుతూనే.

భవానీశంకర్ నావైపు అభినందిస్తున్నట్లు చూశాడు.

ఆ తరువాతేం మాట్లాడాలో నాకు తెలియటం లేదు. సహాయం కోసం వాడివైపు చూశాను. వాడు వెంటనే అందుకున్నాడు.

"వెదర్ చాలా బావుంది" అన్నాడు పందిరివైపు చూస్తూ.

"అవును! చాలా ఆహ్లాదంగా ఉంది" అన్నాన్నేను.

"ఆ చెప్పులు...." అతనేదో చెప్పబోయాడు గానీ, భవానీశంకర్ అడ్డుపడిపోయాడు.

"మీరెప్పుడైనా డార్జిలింగ్ వెళ్ళారా?" అడిగాడతనిని.

"లేదు. ఎందుకు?" ఆశ్చర్యంగా అన్నాడతను.

"అక్కడ ఎప్పుడూ ఇలాగే కూల్‌గా క్లౌడీగా ఉంటుంది వెదర్!" అన్నాడువాడు.

"ఐ.సీ." అన్నాడావ్యక్తి.

"నేను త్రీ టైమ్స్ వెళ్ళానక్కడికి!"

ఆ వ్యక్తికి డార్జిలింగ్ గురించిగానీ, ఆహ్లాదకరమైన వాతావరణం గురించిగానీ ఏ మాత్రం ఆసక్తి ఉన్నట్లు లేదు. అందుకని టక్కున మళ్ళీ సబ్జెక్ట్‌లో దిగిపోయాడు.

"ఆ చెప్పులు...." అన్నాడు నా కాళ్ళవైపు చూపుతూ. నా మెదడంతా మొద్దుబారి పోయింది. ఇంక దేవుడు కూడా నన్ను రక్షించలేడు. ఈ దెబ్బతో పెళ్ళి పందిట్లో నా పరువంతా గోవిందా!

కానీ శంకర్ పరిస్థితిని చేయిదాటిపోనీకుండా మరో ప్రయత్నం చేశాడు.

"అందాకా ఎందుకూ– కొడైకెనాల్లో కూడా అచ్చం ఇలాగే ఉంటుంది"

కానీ ఆ వ్యక్తి అవేం పట్టించుకోలేదు. జలగలాగా పట్టేసుకున్నాడు.

"ఆ చెప్పులు– ఓసారి చూడనిస్తారా." అన్నాడు నాతో.

నాకేం తోచలేదు "ఇహిహి– చెప్పులా?" అన్నాను.

"అవును! ఒకసారి చూడనిస్తారా?"

"ఎందుకు?"

"పనుండి!"

"ఏం పని?"

"ఏదో పని!"

"అలాగా?"

"అవును! మరి చూడనిస్తారా?"

"ఎందుకు చూడటం?"

"పనుంది!"

"ఏం పని?"

"మిష్టర్! మీకే చెప్పేది " ఈసారి గొంతు పెంచి అన్నాడతను. అతని గొంతు మా ముందు వరుసలో కూర్చున్న మరి కొంతమందిని ఆకర్షించింది. అందరూ మా దగ్గరేదో సినిమా ఆడుతున్నట్లు మా వైపు తిరిగి కూర్చుని చూడసాగారు.

నేను భవానీశంకర్ వైపు చూశాను. వాడు అర్జంటుగా గాలిలోకి చూశాడు.

"చూపించండి!" మరింత ధీమాగా అడిగాడతను. నాకు తెలియకుండానే వణుకుతున్న నా కాళ్ళు కుర్చీకింద నుంచి బయటికొచ్చాయి.

భవానీశంకర్ వెంటనే జోక్యం చేసుకున్నాడు.

"చాలా అద్భుతమైన చెప్పులు!" అన్నాడు నాతో "మీక్కూడా నచ్చాయా?" అనడిగాడు ఆ ఎదుటివ్యక్తిని. అతను ఆ ప్రశ్న పట్టించుకోలేదు.

"ఆ చెప్పులు ఎక్కడివి మీకు?" కొత్తగా రిక్రూట్ అయినా పోలీస్‌కానిస్టేబుల్‌లాగా అడిగాడు.

"మీరేకాదు– ఇప్పటికీ ప్రశ్న ఇరవై ముగ్గురు అడిగారు!" అన్నాడు భవానీశంకర్ మళ్ళీ జోక్యం చేసుకుని.

నేనేమీ మాట్లాడకపోవడం చూసి "కదురా" అంటూ నా భుజంచరిచాడు.

"అవును!" ఒప్పుకున్నాను నేను. "ఇతనితో కలసి ఇరవై నలుగురూ" అంటూ సరిదిద్దాను.

"అంత అద్భుతమైన మోడల్" అన్నాడు వాడు. నేను పుంజుకున్నాను.

" ఆ షాపువాడు మా ఫ్రెండ్ కాబట్టి– ఇచ్చాడు! అసలు ఎంత డబ్బు ఇస్తామన్నా ఎవ్వరికీ అమ్మటం లేదు" అన్నాను.

"అవును! ఆ తరువాత మన ఫ్రెండ్స్ చాలామంది షాపుకెళ్ళి అడిగారు– ఎవ్వడికీ ఇవ్వలేదు!"

"అంతెందుకు– వీటినే ఎంతడబ్బు కావాలంటే అంత ఇస్తాం నాకిచ్చెయ్యమని రామచంద్రపిళ్ళై అడిగాడు"

"రామచంద్ర పిళ్ళై కదూ?" కన్‌ఫర్మేషన్ కోసం నన్నడిగాడు మళ్ళీ.

"అవును. రామచంద్ర పిళ్ళై! వెరీగుడ్ ఫెలో! హి ఈజ్ వెరీ ఫాండాఫ్ దీజ్ చెప్పల్స్!" అన్నాడు భవానీశంకర్.

"అవును! అసలు వాళ్ళ వంశమే అంతట– వెరీ ఫాండాడ్ చెప్పల్స్! ఒకసారి 'మీసాలు నీవి, రోషాలు నావి' సినిమా క్యూలో నిలబడినప్పుడు వాళ్ళ పూర్వీకుల హిస్టిరీ అంతా చెప్పాడు నాకు!"

"ఆ క్యూ అంత పెద్దదా?"

"అవును!"

"మరా సినిమా ఎనిమిదోరోజునే ఎలా వెళ్ళిపోయింది?"

"ఎవడన్నాడు ఎనిమిదో రోజువెళ్ళిపోయిందని"

"ఆ హాలు వాడు!"

"ఏడ్చాడు!"

"ఏం ఎందుకు?"

"అది వెళ్ళింది తొమ్మిదో రోజున!"

"మరివాడు ఎనిమిదో రోజున అంటాడేం!"

"వాడి మొఖం! వాడు తొమ్మిదో రోజు ఈ సినిమానే చూసి కొత్త సినిమా అనుకుని ఉంటాడు." ఈ సంభాషణ ఆ వ్యక్తికి ఏమాత్రం నచ్చినట్లులేదు. అంచేత మళ్ళీ మధ్యలో అడ్డుపడ్డాడు.

"ఆ చెప్పులు మీవా?"

భవానీశంకర్ అతని మాటలు వినిపించుకోలేదు. మళ్ళీ రామచంద్రపిళ్ళేని అడ్డం తెచ్చుకున్నాడు.

"రామచంద్ర పిళ్ళే, వాళ్ళ తాతా ఒకసారి ఆగ్రా వెళ్ళినప్పుడు అక్కడ ఫోర్ట్ గేటు పక్కనే ఒక చిన్న చెప్పుల దుకాణంలో అద్భుతమయిన చెప్పుల జత చూశాడట. "అవెంత?" అని అడిగాడట వాడిని. వాడు "రెండొందల యాభైరూపాయలు అని చెప్పాట్ట"

"అవి ఎవరు తయారుచేశారు?" అనడిగాట్ట.

"నేనే!" అని జవాబిచ్చాడట వాడు.

"ఇలాంటివి ఎన్ని జతలు చేశావ్?" అనడిగాడు ఆయన.

"ఇదొక్కటే చేశాను. దీన్నే ధర ఎక్కువని ఎవరూ కొనడం లేదు" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాట్ట వాడు. మరి రామచంద్రపిళ్ళె తాతగారి రోజులంటే మన స్వాతంత్రానికి పూర్వం అన్నమాట. అప్పుడు రెండొందల యాభయ్ రూపాయిలంటే ఎక్కువేకదా!

ఆయన వెంటనే వందనోట్లు అయిదు తీసి వాడికిచ్చి "ఇలాంటివి ఇంకెవ్వరికీ చేయకుండా ఉంటానికిస్తున్నానీ డబ్బు" అని చెప్పి ఆ చెప్పులు తీసుకువచ్చేశాట్ట! ఇప్పటికీ ఆ చెప్పులు అలా ఉంచారు వాళ్ళింట్లో.

"వాళ్ళ ఫాదర్ కూడా మంచి చెప్పుల కోసం మలేసియా వెళ్ళినప్పుడు– ఇలాగే ఒక చిన్న దుకాణం వాడికి–"

రామచంద్ర పిళ్ళే వాళ్ళ వంశం తాలూకూ చెప్పుల కథలు ఆ చుట్టూకూర్చున్న వారికి మహా రసానుభూతిని కలిగిస్తున్నాయేమో కాని, ఆ వ్యక్తిని ఏ మాత్రం కదిలించలేక పోతున్నాయ్, పై పెచ్చు రాను రాను అతనికి ఆ రామచంద్రపిళ్ళే మీద, వాళ్ళ వంశం తాలూకూ చెప్పుల కథలు మనోజ్ఞకంగా వినిపిస్తున్న భవానీశంకర్ మీదా, ద్వేషం ప్రబలిపోతున్నట్లు దాఖలా కనిపించింది.

"ఆ చెప్పులు మీవా? అని నేను– మిమ్మల్ని– అడుగుతున్నాను. "ఒక్కొక్క పదం విడదీసి స్పష్టం చేస్తూ అడిగాడతను.

"ఏ చెప్పులు?" అడిగాను ఏమీ అర్థం కానట్టునటిస్తూ–

"అవిగో- అవి- ఆకాళ్ళకున్నవి?"

"ఏ కాళ్ళకు?"

"మీ కాళ్ళకు!"

"వాటికేమయిందిప్పుడు?"

"ఆ చెప్పులు మీవేనా?"

"హిహిహి" చాలా కాజువల్‌గా నవ్వాలనుకుని ప్రయత్నించాను గాని, అది కాస్తా వెర్రి నవ్వయి కూచుంది.

మొట్టమొదటిసారిగా నాతో ఈ వెధవ పనిచేయించి నన్నిలాంటి పరమభయంకర పరిస్థితిలో పడేసిన భవానీశంకర్‌గాడిని హత్య చేయాలన్నంత కోపం వచ్చింది. కానీ అప్పటికప్పుడు హత్య చేయడం అంత తేలికేం కాదు.

"ఏమిటది?" కోపంగా అడిగాడా వ్యక్తి.

"ఏమిటేమిటి?" ఏమీ తెలీనట్లు అడిగాను.

"ఇప్పుడు నా ప్రశ్నకు ఇహ్హి హ్హి హ్హి అంటూ మీరు చేసిన ప్రక్రియ ఏమిటి? అని అడుగుతున్నాను."

"అదా!" తేలిగ్గా అనేశాను.

"అవును! అదే!"

"నవ్వాను."

"యస్- అది నవ్వే!" తనూ వప్పుకున్నాడు భవానీశంకర్

"ప్లీజ్-డోంట్ ఇంటర్ ఫియర్!" భవానీశంకర్‌కి వార్నింగిచ్చాడతను.

భవానీశంకర్ ఆశ్చర్యంగా అతనివేపు చూశాడు.

"డోంట్ ఇంటర్‌ఫియరా!"

"అవును!"

"ఏమిటి డోంట్ ఇంటర్‌ఫియర్?"

"మధ్యలో కల్పించుకోవద్దు అని రిక్వెస్ట్ చేస్తున్నాను."

"ఎవరి మధ్యలో?"

"మా మధ్యలో?"

"మీరు ఏం చేస్తున్నారు?"

"వెరిఫై చేస్తున్నాను. అంటే నిర్ధారించుకోవడం అన్నమాట!"

"ఏ విషయం?"

"చెప్పుల విషయం!"

"అవా? ఇంపాజిబుల్! ఎంత ప్రయత్నించినా మీ కలాంటివి ఎక్కడా దొరకవ్! రామచంద్రపిళ్ళై కాకుండా వాళ్ళ ఫ్రెండ్ కూడా పాపం ఇలానే వాటిమీద ఎంతో మోజుపడ్డాడుట. అసలు వాళ్ళవంశమే చెప్పుల మీద రీసెర్చిచేశారని...."

"టు హెల్ విత్ రామచంద్రపిళ్ళై" అరచాడు ఆవ్యక్తి.

"ఎందుకలా అరచారు?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

"పిచ్చెక్కి!"

"అప్పుడప్పుడూ అలా మెంటల్ ఎటాక్ వస్తూంటుందా! లేక ఇదే మొదలా?"

ఆ వ్యక్తి మళ్ళీ నావేపు తిరిగాడు

"మిస్టర్! జవాబు చెప్పండి!"

"ఏం జవాబు?"

"అదే, ఆ చెప్పుల గురించి?"

"ఏ చెప్పుల గురించి?"

"మీ కాలికున్నవి!"

"వాటి వివరాలు చెప్పానుగదా"

"నాకావలసింది వివరాలు కాదు– అవి మీవా అని అడుగుతున్నాను."

"ఎందుకు అడగడం?"

"ఎందుకో మీకు తెలీదా?"

"నాకా? నాకేం తెలుస్తుంది?"

"అవును! తెలీదు! ఎందుకంటే అవి మీవి కావు గనుక!"

ఆ మాటతో ఆ చుట్టుపక్కలున్నాళ్ళందరూ ఉలిక్కిపడ్డారు.

నా మొహం కళ తప్పిపోయింది. మెదడు శోషవచ్చి పడిపోయింది. కేవలం మెడుల్లా అబ్లాంగేటా దయమీద ఆధారపడి ఉంది పరిస్థితి.

"ఇవి నావి కాదా?"

"కావు"

"మరెవరివి?"

"నావి!"

"ఇంపాజిబుల్!" అన్నాను భవానీశంకర్ వంకచూసి.

"ఎస్. క్వాయిట్ ఇంపాజిబుల్" అన్నాడువాడు.

"యూ ఆర్ మిస్టేకెన్" అన్నాన్నేను, ఇంగ్లీష్‌లోకి పూర్తిగా దిగిపోతూ. ఇలా పదిమందిలో

పరువుపోయే పరిస్థితుల్లో కేవలం ఇంగ్లీషే మాట్లాడితే చాలా ఉపయోగం ఉంటుందని వాడే చెప్పాడు నాకు.

"యస్! ధరూలీ మిస్టేకెన్" అన్నాడు భవానీశంకర్.

"మిస్టేక్ లేదూ- గాడిదగుడ్డూ లేదు. అవినావి!" ఖండితంగా అన్నాడతను.

"నో నో. దే ఆర్‌మైన్" అన్నాను.

"యస్! హి ఈజ్ ది హోల్ అండ్ సోల్ వోనర్ ఆఫ్ దీజ్ చెప్పల్స్" అన్నాడు భవానీశంకర్.

"నేను కాదు అని చెప్తున్నాను. అవి నావి!" కోపంగా అరచాడతను. సరిగ్గా అదే సమయంలోఫస్ట్ షో సినిమా వదిలినట్లు మొదటి పంక్తిలో కూర్చునిభోజనం చేసిన జనం త్రేవున తేన్చుకుంటూ వచ్చి మా చుట్టూ అప్పటికే గుమికూడిన చిన్న సైజు గుంపుని పెద్దదిగా చేశారు. రోడ్డుపక్కన గారడీవాడిక్కూడా ఇంతమంది ఆడియెన్స్ ఉండరని ఖచ్చితంగా చెప్పవచ్చు. పాత ప్రేక్షకులు క్రొత్తగా వచ్చిన వాళ్ళకి అంత వరకూ జరిగిన కథ క్లుప్తంగా చెప్పడం ప్రారంభించారు.

"కాదు.... నావి!" అన్నాన్నేను- వణుకు తగ్గించడానికి ప్రయత్నం చేస్తూ.

"అవును వాడివే! అందులో అనుమానం లేదు. వాడెప్పటికి ఇంకొకరి చెప్పులుగానీ, లేక మరే ఇతర పాదరక్షలు గానీ, బూట్లుగానీ దొంగిలించేరకం కాదు. అంతేకాదు, చాలా సార్లు మేజోళ్ళు కూడా దొంగతనం చేయలేదు. మీకో విషయం చెప్తే ఆశ్చర్యపోతారు. వాడిప్పటికి నూటముప్పై నాలుగు పెళ్ళిళ్ళకూ హాజరయ్యాడు. మళ్ళీ నూటముప్పై నాలుగేకదట్రా?" నన్నడిగాడు కన్‌ఫర్‌మేషన్‌కోసం.

"అవును ఈ పెళ్ళితో నూట ముప్పయి అయిదు" అన్నాన్నేను.

"కరెక్ట్, నూట ముప్పై అయిదు పెళ్ళిళ్ళకు వెళ్ళాడు. అక్కడ వేలకువేలు చెప్పులు, బూట్లు, బెల్ట్ షూస్, కాన్వాస్ షూల మధ్యగంటల కొద్దీమసిలాడు. అయినా వాడేమయినా చలించాడా? ఒక్క జతయినా ముట్టుకున్నాడా? లేదు. కేవలం వాడి సొంతచెప్పులతోనే ఇంటికి తిరిగి వచ్చాడు? సిన్సియర్‌గా చెప్పండి! కెన్ ఎనీబడీ డూ ఇట్? నో! ఇంపాజిబుల్! అంతేకాదు. వాడికి ఫారిన్ బూట్లు కూడా కొట్టేయగల అవకాశాలెన్నో వచ్చాయ్. అయినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఎందుకని? కారణం ఏమిటి? వాడికి ధైర్యం లేకనా? రన్నింగ్ చేతకాదనా? అవేమీకాదు. సింపుల్ రీజన్- మీ చెప్పులే మీరు ఉపయోగించుడు అన్న నీతికి కట్టుబడ్డ మొదటి పౌరుడువాడు. నేను రెండోవాడినని మీకీపాటికే తెలిసే ఉంటుంది. ఇవిగో నా చెప్పులు చూడండి! ఇవెవరివి? నావి. ఎంతోకాలం నుంచీ వీటినే తొడుగుతున్నాను. ఎన్ని పెళ్ళిళ్ళకెళ్ళినా వీటిని మార్చలేదు. కొత్తవాటితో ఎక్స్‌చేంజ్

చేయలేదు. ఎక్కడికెళ్ళినా ఎంతమందికీ చూపించినా ఇవి నావి అని ఎవ్వరూ అనలేదు, ఎందుకని?" ఉద్వేగంతో అడిగాడు భవానీశంకర్.

"గుర్తుపట్టి ఉండరు... " ఎవ్వరో గుంపులోనుంచి అరిచారు. అందరూ ఘొల్లుమన్నారు కానీ, భవానీశంకర్ అదేమీ పట్టించుకోలేదు.

"కాదు!" అన్నాడు వెంటనే "గుర్తుపట్టక కాదు! వాళ్ళు అవి తమవే అని తెలిసినా గాని మౌనం వహిస్తారు. ఎందుకు? మనుషులను బోలినమనుషులున్నట్లే, చెప్పులును బోలిన చెప్పులుంటాయ్! కనుక నాలాంటి మర్యాదస్తులను– "ఇవి మీవి కావు, నావి....." అని అనడం వారి మర్యాదకు లోపం అవుతుంది" ఇంకా ఎంతసేపు వాడి ఉపన్యాసదోరణి కొనసాగేదో గాని, ఆ వ్యక్తి టక్కున అడ్డుపడ్డాడు.

"అయితే ఇవి మీవే నంటారు!" అన్నాడు నాతో.

"నూటికి నూరుపాళ్ళూ" అన్నాన్నేను.

"అంటే ఇవి అచ్చంగా మీరేకొన్నానంటారు!"

"అవును!"

"ఏషాపులో కొన్నారు?

ఆ ప్రశ్ననాకు భయం కలిగించింది. ఏ షాపులో అని చెప్పగలను? ఒకవేళ ఏదయినా షాపు పేరు చెప్తేవాడు ఎంక్వయిరీ చేస్తాడేమో!

"ఎందుకు? షాపుపేరు కూడా చెప్పాలా?"

"చెప్పాలి"

"ఎందుకు చెప్పాలి?"

"అవిమీవి అని తెలియడానికి! నా చెప్పులు దొంగతనం చేయలేదు అని ఋజువు చేయడానికి!"

"అంటే మీ చెప్పులు నేను దొంగతనం చేశానని మీరనుకుంటున్నారా?"

"అనుకోవడమేమిటి? చేశారు!"

నేను ఆశ్చర్యం నటిస్తూ భవానీశంకర్ వేపు చూశాను.

"హౌ స్ట్రేంజ్?" అన్నాను ఇంగ్లీషులో

"టూ మచ్‌స్ట్రేంజ్!" అన్నాడువాడు

"స్ట్రేంజీ, చీంజీలేదు. ముందుషాపు పేరుచెప్పు!" అన్నాడా వ్యక్తి పట్టుదలగా.

"షాపు పేరా?"

"అవును!"

"రాథోడ్ కర్ చెప్పల్‌గంజ్ అనే షాపులో."

"రసీదుందా?" మళ్ళీ అడిగాడు వాడు.

ఇంక చిరాకేసుకొచ్చింది నాకు. ఎలాగూ దొరికిపోక తప్పదు. దొరికేముందు ఆఖరిసారిగా వో విసురు విసిర్తే గానీ పరువు దక్కేట్లులేదు. అంచేత విరుచుకుపడ్డాను.

"రసీదా?"

"అవును! రసీదే!"

"వాట్ రసీద్"

"ఆ చెప్పులు మీరు రాదోడ్కర్ గంజ్‌లోకొన్నట్లు!"

"రాదోడ్కర్ గంజ్‌కాదు! రాదోడ్కర్ చెప్పల్‌గంజ్"

"అదే రాదోడ్కర్ చెప్పల్ గంజ్"

" 'ధ' కి వత్తుంటుంది"

"ఏ థాకి?"

"రాధోడ్కర్‌లో 'ధో' కి"

"నాక్కావలసింది 'థ' కి వత్తుకాదు. రసీదు!"

"రసీదా?"

"అవును"

"వాట్ రసీద్?"

"ఇదిగో– ఈ నాటకాలు నా దగ్గర కాదు! మర్యాదగా నా చెప్పులు నాకివ్వు!"

"నీ చెప్పులేమిటి? ఇవి నావి! కావాలంటే వాడినడగండి" అంటూ భవానీశంకర్‌ని చూపించాను.

"అవును! అవి వాడివే! నేనే– విట్‌నెస్! కావాలంటే రమచంద్రం పిళ్ళే కూడా విట్‌నెస్సే?"

"ఏడీ! రామచంద్రపిళ్ళే? పిలవండి!"

"కేరళాలో ఉన్నాడు– పిలిస్తే వస్తాడు."

"అయితే రసీదు చూపించండి." అరిచాడావ్యక్తి.

"రసీదా– చెప్పులు కొన్నవాళ్లు జేబులో రసీదులు పెట్టుకొని తిరగాలనుందా?" ఎదురుతిరిగాడు భవానీశంకర్. వాడిలా పాయింటు భలే నచ్చిందినాకు. వాడిని ఎప్పటికయినా హత్య చేయాలన్న ఆలోచన విరమించుకున్నాను.

"జేబులో లేకపోతే ఇంటికెళ్ళి తీసుకురావచ్చుగా?"

నేను– ఏం జవాబు చెప్తాడో అని భవానీశంకర్ వేపు చూశాను.

"ఆ అవసరం మా వాడికి లేదు" అన్నాడువాడు.

"అవును. ఏ మాత్రం లేదు" అన్నాన్నేను.

"లేకపోతే చెప్పులు ఇక్కడ విడిచి వెళ్ళాల్సిందే!" మొండికేశాడతను చొక్కాచేతులు పైకి మడుస్తూ.

పరిస్థితి క్షణక్షణానికీ క్షీణించిపోతోందని గ్రహించి లావుపాటి పొట్టగల వ్యక్తి రంగంలో దూకాడు.

"అయితే ఇప్పుడు ఆ చెప్పులు వోనర్ షిప్ తేలాలన్న మాట!" అన్నాడు పొట్ట సవరించుకుంటూ.

"అవును తేలాలి– దొంగ ఎవడో ఋజువవుతుంది. అప్పుడు వాడిని కసితీరా ఉతకాలి."

నేను అంతవరకూ మర్చిపోయినా వణుకు మళ్ళీ తిరిగి వచ్చేసింది.

"అవునవును" అన్నాడు ప్రేక్షకవర్గంలోనుంచి ఎవరో. బహుశా అదీ ఎప్పుడో పెళ్ళిలో కొత్త చెప్పులు పోగొట్టుకున్న బావతయి ఉంటుంది.

"అయితే వో పని చేద్దాం! ఆ చెప్పుల మీద ఆ కంపెనీ పేరు– ధర ముద్ర వేసి ఉంటుందిగా! అది ఎవరుకరెక్ట్‌గా చెప్తారో చూద్దాం!" అన్నాడు లావుపాటి పొట్ట.

"బ్రహ్మాండంగా వుంది ఆయన అయిడియా!" ప్రేక్షకుల్లో నుంచి ఇంకెవరో సపోర్ట్ చేశారు.

నా పరిస్థితి చాలా విషమించిపోయిందని అర్థమయింది నాకు. క్షణాల మీదుంది వ్యవహారం. ఆ చెప్పుల కంపెనీ పేరు, ధరవాడు ఖచ్చితంగా చెప్పేయగలడు. దాంతో నా ఆటకట్టు. భవానీశంకరంగాడిని మర్డర్ చేయాలనుకున్న పాత కోరిక మళ్ళీపైకి లేచింది.

"ముందు అతనినే చెప్పమనండి చూద్దాం!" అన్నాడావ్యక్తి దొరికిందే సందని.

"కాదు ముందు అతనినే చెప్పమనండి!" అన్నాన్నేను చెమటలు తుడిచేసుకుంటూ.

"అబ్బా ఆశే! నేను చెప్తే– నువ్వా అదే కాపీకొట్టిచెప్తామనా?"

"అవును! ఇద్దరినీ చీటీలు రాసి ఇవ్వమనండి! వాటిని పరీక్షచేసి రెండింట్లో ఏది ఉత్తమమయినా ఎంట్రీయో నిర్ణయించి బహుమతి ప్రధానం చేద్దాం" అది మరో ప్రేక్షకగొంతు.

క్షణాల్లో మా ఇద్దరి చేతుల్లో ఎంట్రీఫారాలు వచ్చిచేరినాయ్!

"అతనిని కూర్చోనీకండి! కూర్చుంటే కాళ్ళు పక్కకు జరిపి చెప్పులమీదున్న పేరు, ధర చూస్తాడు" అన్నాడావ్యక్తి. నా గుండెల్లో మరోరాయిపడింది! ఎలాగోలా కాలు తొలగించి వాటికంపెనీ పేరు రాద్దామనుకున్నాను.

"నాకిలా నుంచుని రాయడం రాదు!" అన్నాను హీనస్వరంతో.

"అవును! ఇప్పుడే కాదు- మొదట్నుంచీ అంతే! స్కూలు గార్డెన్‌లో కొబ్బరికాయలు దొంగతనం చేసినప్పుడు కూడా క్లాసులో టీచర్ నుంచోపెట్టి నోట్సురాయమంటే ఒక్క అక్షరం కూడా రాయలేక పోయాడు" సపోర్ట్ చేశాడు భవానీశంకర్.

ప్రేక్షకులంతా మళ్ళీ మనసారా నవ్వారు. అందులో అంత హాయిగా నవ్వాల్సిన విషయం ఏముందో మా ఇద్దరికీ అర్థంకాలేదు.

"ఫరవాలేదు! ఇది దస్తూరి పోటీకాదు కదా- పేజీలు పేజీలు కూడా రాయనక్కరలేదు. రెండు మూడక్షరాలు మహా అయితే" లావుపాటి పొట్ట సలహా ఇచ్చాడు.

"అవునహో- అవును" మరో ప్రేక్షకగొంతు.

ఆ వ్యక్తి అటువేపు తిరిగి తను రాస్తున్నది నేను చూడకుండా ఏదో కాగితం మీదగీకి ఆ ఎంట్రీ ఫారం లావుపాటి పొట్టకు అందజేశాడు.

"రాయవయ్యా! నువ్ కూడా కానీ" ఎవరో చెవిలో అరిచారు.

పెన్ను చేతిలోకి తీసుకుని నాకు తెలిసిన చెప్పుల కంపెనీ పేర్లన్నీ ఆలోచించాను.

"నాకు పేరు గుర్తురావడం లేదు" అన్నాను ఏడుపు, బలవంతంగా ఆపుకుని.

"పోనీ పేరు మర్చిపోతే చెప్పుల సైజురాయి"

నాకు తోచిన సైజ్, ధర త్వరత్వరగా రాసీ ఆ లావుపాటి పొట్టకిచ్చాను.

"ఆ! ఇప్పుడు చెప్పులు విప్పమనండి!" ఆ వ్యక్తి ఆనందంగా అన్నాడు.

"విప్పవయ్యా?" వణుకుతున్న కాళ్ళు నొక్కిపెట్టి వో చెప్పు జారవిడిచాను.

దానిమీద మెరుస్తోన్న అక్షరాలు ధర చూసేసరికి నాకు కళ్ళు తిరిగినయ్. ఆ పేరు అంతవరకూ కనీవినీ ఎరగనిది. ధర రెండొందల తొంభయి ఎనిమిది రూపాయలు. నేను కాగితంలో నూట అరవై రెండు రూపాయలని రాశాను.

"ఇదిగో- ఇతను రాసినపేరు, ధరా, సైజూ అన్నీ కరెక్ట్‌గా సరిపోయాయ్. కనుక- ఇతనే బహుమతి పొందిన విజేత!" అంటూ ఆ వ్యక్తి చేతిని పట్టుకుని పైకెత్తాడు లావుపాటి పొట్ట.

"నో- నేనొప్పుకోను! ఎప్పుడో కొన్నవవటం వల్ల గుర్తులేక అలా రాశాడు" అన్నాడు భవానీ! కానీ అతని మాటలెవరు పట్టించుకోలేదు-.

నేను చెప్పులు విడిచి దూరంగా జరిగాను. ఆ వ్యక్తి విజయగర్వంతో చెప్పులు ధరించాడు.

అంతా కరతాళధ్వనులు చేశారు. "తరువాతి కార్యక్రమం ఏమిటి?" ఏవరో అరచారు.

నేను పడిపోబోయి కుర్చీ పట్టుకుని నిలబడ్డాను.

"ఇది అన్యాయం! అయ్ ప్రొటెస్ట్ ఇట్!" అంటూ అరిచాడు భవానీశంకర్.

"పేరు సైజు ధర చెప్పినంతమాత్రాన చెప్పులమీద హక్కులభించడం అక్రమం" అన్నాడు వాడు. ఎవరూ వాడి మాట వినిపించుకున్నట్లు లేదు.

"వీడిని చూడండి! వీడి మొహం చూడండి! వీడి స్టేటసేమిటి? వీడి హిస్టరీ ఏమిటి? వీడి ఫ్యూచరేమిటి? ఇలాంటి పెద్దమనిషిని– కేవలం ధరా, సైజూ, పేరూ, చెప్పలేక పోవడం వలన చెప్పులు లాక్కుని అవమానపరుస్తారా? అసలు ఈ పద్ధతి...." యింకావాడేం చెప్పేవాడో నాకు తెలీదుగాని, నా గురించివాడు చెబుతున్న మాటలు నాకే జాలి కలిగించి కళ్ళ వెంబడి నీళ్ళు తెప్పించాయ్.

ఇంతలో ఎవరో వాడి ప్రవాహానికి పెద్ద ఆనకట్టలా అడ్డుపడ్డారు.

"చాల్లేవయ్యా– చేసేది వెధవపనులు, చెప్పేది బోడికబుర్లు" ఎవరోకసిగా అరచారు.

"ఆ మాట అంది ఎవరో?" లేచి కుర్చీ ఎక్కి నిలబడ్డాడు భవానీశంకర్ చొక్కా చేతులు మడచి.

"నేను!" అంటూ ముందుకొచ్చిందో బట్టతల! అతని చొక్కా చేతులు అప్పటికే మడచి ఉన్నాయ్. పైగా కండలు తిరిగిన శరీరం.

"మీరా?" కొంచెం తగ్గి అడిగాడు భవానీశంకర్.

"అవును! ఏం చేస్తావ్?"

"ఏం చేస్తానా? అలా అనడం మర్యాద కాదని చెప్తాను" అంటూ కుర్చీదిగిపోయాడు.

"లేకపోతే అతను చేసిన పనేమిటి? అది మర్యాదగలపనా?"

"మీరు ఊరికే అపార్థం చేసుకుంటున్నారు గానీ అది కేవలం పొరపాటువల్ల జరిగి ఉండవచ్చు"

"అంటే?"

"వీడివీ అచ్చం అలాంటి చెప్పులే! అందుకని పొరపాటున అవే వేసుకున్నాడు. ఇందులో వెధవపని ఏముంది, అమర్యాద ఏముంది?"

"అవును! నా చెప్పులూ అచ్చం ఇలాగే ఉంటాయ్" అన్నాన్నేను స్పృహలోకొచ్చి.

"అయితే నీ చెప్పులేవీ మరి?" ఎవరో కూశారు.

"అదే నాకు అర్థం కావటం లేదు." అన్నాను వరండా అంతా వెతుకుతూ.

"మనుజులను పోలిన మనుజులున్నట్టే చెప్పులను బోలిన చెప్పులుండటం వల్లనే ఈ అనర్థం జరిగి ఉంటుంది" అన్నాడు భవానీశంకర్.

"అయితే మరి అతను వేసుకొచ్చిన చెప్పులేమయినయ్?" ఎవరో అడిగారు.

"అదే! ఇప్పుడు వాటిని వెతకటమే మన ప్రథమకర్తవ్యం!"

ఎవ్వరూ వెతకలేదు గానీ నేను కాసేపు వెతుకుతున్నట్లు నాటకం ఆడుతూ పందిరంతా తిరిగాను.

మరి కాసేపటికి వెతకడం ముగించాను. "ఎవరో కొట్టేశారు" అన్నాను అప్పుడే నగ్నసత్యం తెలుసుకున్నట్లు.

"అరె-పాపం" అన్నాడు భవానీశంకర్ జాలిపడి.

"అవును! కొట్టేశారు"

"దిసీజ్ టూ మచ్- కొత్త చెప్పులు" అన్నాడువాడు.

"చాలా కాస్ట్లీ కూడా!"

"ఇంకా హారిబుల్!" అన్నాడువాడు

"ఇదే మొదటిసారి పోవటం."

"అదీ సొంత చెప్పులు పోతే చాలా బాధగానే ఉంటుంది."

"ఇవి మరీ సొంతచెప్పులు."

"పరాయివాడివయితే కొంత ఫరవాలేదు."

"ఇకనుంచీ ఇలా మన చెప్పులను బోలిన చెప్పులు కనిపించినప్పుడు ఆ పెళ్ళిలో ఒక్క క్షణం కూడా ఉండను" అన్నాను కోపంగా.

"అవును! ఇలాగే అమానుషంగా కంపెనీపేరు చెప్పమనీ ధర చెప్పమనీ ట్రిక్స్ ప్లేచేసి లాగేసుకుంటారు."

ఇలా చుట్టూ ఉన్న ప్రేక్షకుల సానుభూతిని సంపాదించడానికి ఇద్దరం విశ్వప్రయత్నాలూ చేస్తాంటే వరండాలో అరుగుఎక్కి వోగొంతు ఖంగుమని అరిచింది.

"ఈ చెప్పులెవరివో చూడండి బాబూ! నేను అర్జంటుగా విడిదింటికెళ్తూ. వెంటనే తిరిగిరావచ్చు కదాని వేసుకెళ్ళాను. అక్కడ పావుగంట ఆలస్యం అయిపోయింది. ఇక్కడ ఈ చెప్పుల యజమాని ఎంతగా విలపిస్తున్నాడో అని పరుగుతో వచ్చాను- ఇవి ఎవరివో తీసుకోండి సార్!" నేనూ, భవానీశంకర్ ఒక్క ఉదటున పరుగెత్తికెళ్ళి చూశాము.

నా గుండెలు ఆనందంతో కొట్టుకున్నాయ్. మనసు సంతోషంతో ఎగసిపడింది.

"ఏంటి బాబూ, ఇవి మీవేనా?" అడిగాడు ఆ వ్యక్తి.

"అవును" అనబోతుండగా 'కాదు' అరిచాడు భవానీశంకర్.

"కాదా." ఆశ్చర్యంగా అన్నాను.

"కాదు!" అన్నాడువాడు. "నీ చెప్పులు- అదిగో! అతని చెప్పులను పోలి ఉండాలి కదా! ఇవి నీవెలా అవుతాయ్?" అన్నాడు కన్నుగీటుతూ. నాకు వాడిమాటల్లోని అంతర్ధారం

అప్పుడుగాని బోధపడలేదు. "అవును! నావి కావు!" అన్నాన్నేను. "నావి కాని చెప్పులను ఎప్పటికీ నావి కావనే చెప్తాను" అందరివేపూ సగర్వంగా చూసి అన్నాను.

"అంతేగాని తన చెప్పులు పోయినాయని ఇంకొకరి చెప్పులు కాజేసే వెధవ బుద్ధి వీడికి లేదు" అన్నాడు భవానీశంకర్.

"ఆ చెప్పులు నావి అని ఎవరూ రాకపోయినా, నేను వాటిని అడగను. ఎవరయినా బలవంతంగా ఇచ్చినా తీసుకోను" అన్నాను అలా జరుగుతే బాగుండునని క్లూ ఇస్తూ.

"ఒకవేళ అంతంగా ఇక్కడున్న వారంతా కలసి బలవంత చేస్తే తప్ప" అన్నాడు భవానీశంకర్. అలా అంటే అందరూ బలవంతం చేసి వాటిని నాకిస్తారని వాడి ఆలోచన. కాని ఎవరూ బలవంతం చేయలేదు. కనీసం 'పోనీలే తీసుకో' అనికూడా అనలేదు.

"అవి బహుశా నీ చెప్పులు పొరపాటున వేసుకెళ్ళినతని చెప్పులయి ఉంటాయ్. కనుక నువ్వు తీసుకోవచ్చు!" అన్నాడు భవానీ అందరి మొఖాల వంకా చూస్తూ..

ఎవ్వరూ వ్యతిరేకంగా మాట్లాడకపోయేసరికీ నాకు ధైర్యం వచ్చింది. "నువ్వు తప్పదంటే తీసుకుంటాను" అన్నాను మొఖమాటం, అయిష్టం నటిస్తూ!

"ఈసారి తీసుకో! కాళ్ళకేదొక "రక్ష" ఉండాలి కదా! ప్లీజ్ తీసుకో!" అన్నాడు వాడు అయిష్టం నటిస్తూ. నేను తీసుకోబోతుండగా వో వ్యక్తి ఆదరాబాదరా వచ్చి ఆ చెప్పులు తొడిగేసుకున్నాడు. నాతోపాటు అక్కడున్న వారందరూ కూడా ఆశ్చర్యపోయారు.

"వీటికోసం నేను అరగంట నుంచీ వెతుకుతున్నాను. అయినా అలా అడక్కుండా ఎవరు తీసుకెళ్ళమన్నారు నిన్ను! నువ్వుచేసిన నిర్వాకం మూలాన నేను వీటికోసం ఎక్కడెక్కడో గాలిస్తూన్నాను–" అన్నాడతను ఆ చెప్పులు తెచ్చిన వ్యక్తి మీదకోపంతో.

"నాది పొరపాటే అని చెప్తున్నాను కదండీ!" అన్నాడా పెద్దమనిషి నొచ్చుకుంటూ.

"ఇంకోసారిలాంటి పనిచేయకు!" అన్నాడా వ్యక్తి.

"ఇంకెందుకు చేస్తానండీ–"

నేనూ, భవానీశంకర్ ఉక్కిరిబిక్కిరయిపోతున్నాం! అవి నా చెప్పులు! కొత్తవి! అరోజే నేను వేసుకున్నవి. స్పష్టంగా తెలిసిపోతుందా విషయం. మరివాడు అంత నిర్భయంగా అబద్ధం చెప్పి ఎలా దొంగిలించుకుపోతున్నాడు?

"అవి మీవా?" ఆశ్చర్యంగా అడిగాను ఆ వ్యక్తిని.

"అవును! ఏం?"

"అహ– మరేంలేదు– ఊరికే అడిగాను–"

"ఊరికే ఎందుకడగడం?"

"మా ఫ్రెండ్ ఒకతనికి కూడా అచ్చం ఇలాంటివే ఉన్నాయ్."

"మనుజులను బోలిన మనుజులున్నట్లు- చెప్పులను బోలిన చెప్పులుంటాయి నాయనా!" చిరునవ్వుతో అన్నాడా వ్యక్తి.

"అవునవును" అన్నాడు భవానీశంకర్ చిరునవ్వుతో.

"నామీద మీకేమయినా అనుమానముంటే చెప్పండి! ఈ చెప్పుల కంపెనీ పేరుగెట్రో! ధరతొంబై ఆరు నిన్నేకొన్నాను- ఇవాళే వాడటం మొదలు పెట్టాను" అని నెమ్మదిగా పందిట్లో నుంచి వెళ్ళిపోసాగాడతను. వాడు చెప్పుల దొంగ అని తెలిసిపోతూనే ఉంది! కానీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.

నాకు కళ్ళవెంబడి నీళ్ళు కారిపోతున్నాయ్. భవానీశంకర్ జేవురించిన మొఖంతో అ దొంగ వెధవ వంకచూస్తున్నాడు. "రండి బాబు- భోజనానికి రండి!" అన్నారెవరో మా మీద జాలిపడి.

"నాకాలిలేదు-" అంటూ నేను అక్కడినుంచి బయటపడ్డాను. నా వెనుకే భవానీశంకర్ వచ్చాడు. ఇద్దరం బస్‌స్టాప్‌లో నిలబడ్డాం

"ఒకోసారి ఇలా భలే తమాసాలు జరుగుతుంటాయ్-" అన్నాడు చిరునవ్వుతో.

"ప్లీజ్ గెటెవే ఫ్రమ్‌దిస్ ప్లేస్" అన్నాన్నేను కోపం అణచుకుంటూ.



"అదేమిట్రా? అంతకోపం ఎందుకు? ఒకోసారి మనప్లాన్ ఫెయిలవుతూంటుంది. అంతమాత్రాన ఇలా నిరుత్సాహ పడకూడదు. వచ్చే నెలలో మన రంగరాజుగాడి పెళ్ళి ఉండనే ఉంది- అప్పుడు మంచి జత చూద్దాం! అయినా నువ్ నేను చెప్పిన ముఖ్యమైన సూత్రం మర్చిపోకూడదు- చెప్పులు తొడుక్కున్నాక వేగంగా వెళ్ళిపోవాలి. నీ సొంతచెప్పులు వేసుకున్న ఆ దొంగవెధన బులెట్‌లాగా ఎలా వెళ్ళిపోయాడో చూశావ్ కదా! వెనక్కు తిరిగి ఛస్తే చూడకూడదు. ఎవరు పిలిచినా వినిపించుకోకూడదు. కేకలు, అరుపులు పోలీసుల విజిల్స్, ఇవేమీ-"

"మర్యాదగా ఇక్కడి నుంచి పోతావా, లేదా?" పిడికిలి బిగించి అడిగాను.

"ఓ! మనసు పాడయిపోయిందన్నమాట! ఓకే, ఓకే బాగున్నప్పుడు కలుస్తాన్లే మళ్ళీ ఎలాగూ నెక్ట్స్‌మంత్ రంగరాజు గాడి పెళ్ళికి ప్రోగ్రాం ఉందికదా! డోన్ట్‌వర్రీ"

నేను వాడి మొఖంమీద ఒక్కపిడిగుద్దు వేశానుగానీ, అదిగాలిలోకి తేలిపోయింది. వాడు అప్పటికే రెండొందలగజాల దూరంలో ఉన్న చౌరస్తా దాటుతున్నాడు.